సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 22 । ఆగస్టు । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

పెదవేగి: రాట్నాలకుంటలో రాట్నాలమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 84 రోజులకు రూ.15,39,328 ఆదాయం లభించినట్టు ఈఓ సతీష్‌కుమార్ తెలిపారు.



జానపదం.. చైతన్య పథం

సమాజాన్ని ఉత్సాహపరచడం కోసం వినోద సాధనంగా ప్రారంభమై అనంతర కాలంలో కళగా అవతరించిందే జానపదం. నేడు ప్రపంచ జానపద దినోత్సవం. 8లో ▸



మొక్కజొన్నలో మెలకువలు

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 8లో ▸

శ్రావణ వేళ.. మార్కెట్లు భళా

- జోరుగా స్వర్ణ, వస్త్ర, కిరాణా వ్యాపారాలు
- వివాహాది శుభకార్యాలతో సందడి
- కోట్లాది రూపాయల లావాదేవీలు



భీమవరంలోని ఓ వస్త్ర దుకాణంలో కొనుగోలుదారులతో సందడి

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రావణ మాసం మార్కెట్లకు కొత్త కళను తెచ్చిపెట్టింది. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వివాహాలు, గృహప్రవేశాలు, ప్రారంభోత్సవాలు, శ్రావణ మాస వ్రతాలు, పూజలు తదితర కార్యక్రమాలు భారీగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వస్త్ర, కిరాణా వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో ప్రతిరోజూ కోట్లాది రూపాయలు వ్యాపారం జరుగుతోంది. గత నెల వరకు ఆషాఢ మాసం, మూఢం కారణంగా వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. ఈనెల 5 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కాగా మార్కెట్లకు మంచి రోజులొచ్చాయి. శ్రావణ మాసం ప్రారంభమై 16 రోజులు గడవగా మార్కెట్లు ఊపు మీద ఉన్నాయి. వచ్చేనెల 5 వరకు శ్రావణ మాసం ఉండటంతో ఇదే జోరు కొనసాగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పల్లె నుంచి పట్టణం వరకు కొనుగోళ్ల సందడి కనిపిస్తోంది.

రూ.70 కోట్లకు పైగా వస్త్ర వ్యాపారం

జిల్లావ్యాప్తంగా ఈ శ్రావణ మాసంలో ఇప్పటి వరకూ రూ.70 కోట్లకుపైగా వస్త్ర వ్యాపారం జరిగినట్టు వ్యాపారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, శుభ కార్యాలకు నూతన వస్త్రాలు తప్పనిసరి కావడంతో వ్యాపారం జోరుగా సాగుతుందని అంటున్నారు. సాధారణ రోజుల్లో జిల్లాలో రోజుకు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వస్త్ర వ్యాపారం జరిగితే ఈ నెలలో రోజుకు రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయని, ఈ మాసంలో మొత్తంగా రూ.100 కోట్ల వస్త్ర వ్యాపారం జరుగుతుందని చెబుతున్నారు. జిల్లాలో 1,500కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి.

కిరాణా.. రయ్‌రయ్

శ్రావణమాసంలో కిరాణా వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా భోజన ఏర్పాట్లకు నిత్యావసర సరుకుల కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ మాసంలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు రూ.70 కోట్లకుపైగా కిరాణా వ్యాపారం జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. కిరాణా సరుకులతో పాటు కూరగాయలు విక్రయాలూ అదేస్థాయిలో జరుగుతున్నాయి.

అమ్మకాలు బాగున్నాయి



ఈ ఏడాది శ్రావణ మాసంలో అమ్మకాలు బాగున్నాయి. వివాహాలు, అన్ని శుభకార్యాలకు వస్త్రాల కొనుగోళ్లు జరుగుతున్నాయి. బట్టల వ్యాపారులకు శ్రావణ మాసం కలిసివచ్చే కాలంగా ఉంటుంది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ మాసంలో వస్త్రాల కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. జిల్లావ్యాప్తంగా వస్త్ర వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది.

– మావూరి సుందరరావు, వస్త్ర వ్యాపారి, భీమవరం

ధర పెరిగినా.. వన్నె తగ్గని స్వర్ణ వ్యాపారం



బంగారం షాపులో కొనుగోలుదారులు

బంగారం ధర రోజురోజుకూ పెరుగుతున్నా శ్రావణ మాసం కారణంగా జిల్లావ్యాప్తంగా బులియన్ మార్కెట్ జోరు మీద ఉంది. ప్రధానంగా భీమవరం, నరసాపురం, తణుకులోని జ్యూయలరీ దుకాణాల్లో రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వివాహాలు, ఫంక్షన్ల నిమిత్తం ఆభరణాల రూపంలో బంగారం కొనుగోళ్లు జరుగుతున్నాయి. గత నెల వరకు కొనుగోళ్లు తక్కువగానే ఉన్నా.. శ్రావణ మాసం మొదలైనప్పటి నుంచి కొనుగోళ్లు క్రమేపీ పెరుగుతున్నాయి. గత 20 రోజుల్లో సుమారు రూ.100 కోట్ల మేర బంగారం వ్యాపారం జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో భారీ జ్యూయలరీ షాపుల నుంచి చిన్నపాటి బంగారం దుకాణాల వరకూ కొనుగోళ్ల సందడి కనిపిస్తోంది. జిల్లాలో సుమారు 500 బంగారం దుకాణాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ట్రెజరీ అధికారి గణేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి మూడు నెలలకోసారి సమన్వయ సమావేశం ఏర్పాటుచేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సమావేశాన్ని బుధవారం భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ పెన్షనర్ల పలు సమస్యలను లేవనెత్తగా వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేస్తామని జిల్లా ట్రెజరీ అధికారి గణేష్ హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న ట్రెజరీ అధికారి గణేష్, సీనియర్ అకౌంటెంట్ జగదీశ్వరరాజు, సహాయకుడు సూర్యనారాయణను సంఘం తరపున సత్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్, భీమవరం శాఖ ప్రధాన కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరవాసరం కళాశాలలో బోటనీ, ఈఈటీ కోర్సు, ఈటీ కోర్సు, యండగండిలో ఇంగ్లిష్, గణపవరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూఏ, పెంటపాడులో ఓఏఎస్, యలమంచిలిలో ఇంగ్లిష్ సబ్జెక్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 24న భీమవరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం, ఎస్‌జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపికకు హాజరుకావాలని తెలిపారు. విశ్రాంత, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యమిస్తామన్నారు.

27 రోజులు.. రూ.2.39 కోట్లు

చిన వెంకన్నకు కానుల పంట



హుండీల నగదు లెక్కిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో జరిగిన లెక్కింపులో విశేష ఆదాయం సమకూరింది. గత 27 రోజులకు గాను నగదు రూపేణా రూ.2,39,96,220, కానుకల రూపంలో 145 గ్రాముల బంగారం, 6.19 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.98 వేలు లభించిందన్నారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆరోగ్య శాఖకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. గుంటూరులోని నాగార్జున వర్సిటీలో జరిగిన వర్క్‌షాప్‌లో జిల్లా తరపున డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ అవార్డు అందుకున్నారన్నారు. ఎన్‌క్యూఏఎస్ నోడల్ అధికారి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, సభ్యులు సీహెచ్ సునీత, టి.అనిత తదితరులు జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారని, సిబ్బంది పనితీరు, మందుల నిర్వహణ, నాణ్యమైన సేవలకు సర్టిఫికేషన్ ఇచ్చారన్నారు. జిల్లాకు అవార్డు రావడంపై అదనపు డీఎంహెచ్ఓ బి.భానునాయక్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి పి.సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

‘ఉద్యోగ దిక్సూచి’కి పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ నాగరాణి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): నరసాపురం వైఎస్ డిగ్రీ కాలేజీలో ఈనెల 23న జరిగే ప్లేస్‌మెంట్ డ్రైవ్ (ఉద్యోగ దిక్సూచి)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ, గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిశ్రమల శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. క్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలని, ఇంటర్వ్యూలో ఎంపికైన వారు డ్రాప్‌అవుట్ కాకుండా వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించి, ఉద్యోగంలో చేరేలా చూడాలన్నారు. ఇష్టపడి ఇంటర్వ్యూలకు వచ్చేవారు ఎవరైనా ఉంటే మరో రెండు రోజులు వారికి అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. సోలార్, డ్రోన్ టెక్నాలజీ ట్రైనింగ్‌కు అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖల వారిని సంప్రదించి ప్రదేశాలను గుర్తించాలన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

23న గ్రామ సభలు

రాష్ట్రంలో ఈనెల 23న ఒకే రోజు నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయాలని, ప్రతి సభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో గ్రామ సభలు, ఉచిత ఇసుక విధానం అమలుపై ఆయన సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, అధికారులు హాజరయ్యారు.

అనివేటి మండపంలో వసూళ్ల పర్వం

చిన వెంకన్న క్షేత్రంలో వెలుగుచూసిన ఉదంతం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలోని అనివేటి మండపంలో పెళ్లి బృందాల నుంచి కొందరు దేవస్థానం సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈనెల 18న అనివేటి మండపంలో ఓ స్వీపర్ కొందరిని డిమాండ్ చేసి డబ్బులు వసూలు చేసిన ఉదంతం బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. శ్రావణమాసం కావడంతో శ్రీవారి క్షేత్రంలో భారీగా వివాహాలు జరుగుతున్నాయి. ఇదే అదనుగా కొందరు సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈనెల 18న రాత్రి కామవరపుకోట మండలం ఈస్టు యడవల్లికి చెందిన మాదాసు బసవరాజుకు, టి.నరసాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన రాతిపల్లి దివ్యకు అనివేటి మండపం నంబర్ 35లో వివాహం జరిగింది. ఈ సమయంలో ఓ స్వీపర్ క్లీనింగ్ చార్జీలంటూ డబ్బులు డిమాండ్ చేసింది. తాము మండపానికి, వివాహానికి, వీడియోలకు దేవస్థానానికి సొమ్ములు చెల్లించామని పెళ్లివారు చెప్పినా వినలేదు. ఇలా పెళ్లి కొడుకు తండ్రి నుంచి రూ.500, పెళ్లి కూతురు తరఫు వారి నుంచి రూ.500 మొత్తంగా రూ.1,000 వసూలు చేసింది. ఆలయంలో క్లీనింగ్ చార్జీల పేరుతో ఇలా వసూలు చేయడం దారుణమని పెళ్లి బృందాలు అంటున్నాయి. ఇదిలా ఉండగా అనివేటి మండపం టికెట్ రూ.1,800లు అయితే పెళ్లి కుమారుడు మాదాసు బసవరాజు నుంచి సిబ్బంది రూ.2 వేలు తీసుకోవడం గమనార్హం. ఆయా వ్యవహారాలపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరిపిస్తామని చెప్పారు.

ఐఫోన్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: తాను కోరిన విధంగా ఐఫోన్ కొనివ్వలేదని ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన బి.రామకృష్ణ (17) 10వ తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. రామకృష్ణ తల్లిదండ్రులు కూలీలు. కొంతకాలంగా ఐఫోన్ కావాలని రామకృష్ణ తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాడు. ఈ క్రమంలో వారిని బెదిరించాలని ఈనెల 14న ఎలుకల మందు తిన్నాడు. కుటుంబసభ్యులు ఏలూరు సర్వజన ఆస్పత్రికి అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 20న రాత్రి రామకృష్ణ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంద్ ప్రశాంతం



భీమవరంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన

భీమవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్సీ సంఘాల నాయకులు జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచే పట్టణాలు, గ్రామాల్లో తిరిగి షాపులు మూయించారు. ఆర్టీసీ బస్సు డిపోల వద్ద బస్సులను నిలిపివేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాఠశాలలు, కళాశాలలను మూసివేశాయి. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో అర్ధనగ్నంగా మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ దళితులను విభజించి పాలించాలనే బీజేపీ, టీడీపీలు చేస్తున్న కుటిల రాజకీయాలకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేసి అడ్డుకుంటామన్నారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్‌కుమార్, నేతల సాల్మన్‌రాజు, చిల్లే రాజ్‌కుమార్, చిగురుపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ వి.భీమారావు పర్యవేక్షణలో జిల్లాలోని ప్రధాన పట్టణాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాట్లుచేశారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, బంద్ ప్రశాంతంగా జరిగిందని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఓ ప్రకటనలో తెలిపారు.

దూషణలు.. వేధింపులు

చింతమనేనీ.. ఇదేం పని !

- ఏలూరు జిల్లాలో 63 మంది కార్యదర్శులకు పదోన్నతి
- తన నియోజకవర్గంలో పదోన్నతి పొందిన వారే లక్ష్యం
- ఆరుగురు కార్యదర్శులను రిలీవ్ చేయకూడదంటూ హుకుం
- ఆయన ఆదేశాలకు జీహుజూర్ అన్న ఉన్నతాధికారులు
- ఎమ్మెల్యే చింతమనేని వేధింపులతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికారులు, ఉద్యోగులపై టీడీపీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వేధింపులకు ఇదో మచ్చుతునక. ఏలూరు జిల్లావ్యాప్తంగా 63 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు రాగా 57 మంది కొత్త స్థానాల్లో చేరారు. తన నియోజకవర్గానికి చెందిన మిగిలిన ఆరుగురి పదోన్నతికి మాత్రం చింతమనేని మోకాలడ్డు పెడుతున్నారు. ఆ ఆరుగురిని టార్గెట్ చేసి వారిని రిలీవ్ చేయడానికి వీల్లేదంటూ ఉన్నతాధికారులకు అధికార పార్టీ ఎమ్మెల్యే హుకుం జారీచేశారు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరో మూడు రోజులు జాప్యం జరిగితే వచ్చిన పదోన్నతులు దక్కకపోగా స్థానికంగా తీవ్ర అవమానాలు, భౌతిక దాడులు భరిస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏలూరు జిల్లాలో ఈనెల 8న 63 మంది గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్–2 పదోన్నతి దక్కింది. పదోన్నతి ఉత్తర్వులు జారీ అయిన రోజు నుంచి 15 రోజుల్లోగా కొత్త స్థానంలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పదోన్నతుల వ్యవహారం సజావుగా సాగింది.

అయితే దెందులూరు నియోజకవర్గంలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇక్కడ 12 మందికి పదోన్నతి దక్కితే ఆరుగురు నానా తంటాలు పడి గత వారంలో రిలీవ్ అయి కొత్త స్థానంలో విధుల్లో చేరారు. మిగిలిన ఆరుగురిని మాత్రం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ టార్గెట్ చేశారు. గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించారని, స్థానిక నేతలతో సన్నిహితంగా ఉన్నారని, ఇలా రకరకాల ముద్రలు వేసి ఆ ఆరుగురు పదోన్నతులు అడ్డుకున్నారు. తనకు చెప్పకుండా వారిని రిలీవ్ చేయడానికి వీల్లేదని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌కు ఆయన ఆదేశించారు. దీంతో పదోన్నతులు పొందిన ఆరుగురి భవితవ్యం గాలిలో ఉంది.

ఎమ్మెల్యే రెడ్‌బుక్ రాజకీయాలు

దెందులూరు మండలంలో రామారావుగూడెం, పెదవేగి మండలంలోని విజయరాయి, నడిపల్లి, భోగాపురం, జగన్నాథపురం, ఏలూరు రూరల్ మండలంలో మల్కాపురం పంచాయతీ కార్యదర్శులను వేధిస్తూ ఎమ్మెల్యే రెడ్‌బుక్ రాజకీయాలకు తెరతీశారు. కక్ష సాధింపులతో నిరంతరం అవమానాలకు గురిచేయడంతో పాటు మాటలతోనూ వేధిస్తున్నారు. వీరిలో ఒక పంచాయతీ కార్యదర్శిపై కొద్దిరోజుల క్రితం జరిగిన సమావేశంలో 40 నిమిషాల పాటు బహిరంగ వేదికపైనే తీవ్రస్థాయిలో చింతమనేని విరుచుకుపడ్డారు. అంతటితో శాంతించకుండా ప్రొటోకాల్ పాటించలేదనే కారణంతో సదరు కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డీపీఓను ఆదేశించడంతో డీపీఓ ఆగమేఘాలపై సస్పెన్షన్‌కు ఫైల్ రెడీ చేశారు. ఇక మరో పంచాయతీ కార్యదర్శి రిలీవ్ కోసం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు ఆ కార్యదర్శిని గట్టిగా మందలించి మరీ పంపినట్లు సమాచారం. ఈనెల 23వ తేదీలోపు వీరంతా విధుల్లో చేరాల్సి ఉంది. ఇదంతా జిల్లా పంచాయతీ అధికారికి పూర్తిగా తెలిసి జరుగుతున్నా.. ఏమీపట్టనట్లు వ్యవహరించడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధికి సర్దిచెప్పి సమన్వయం చేసుకోకపోవడం, అలాగే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లకపోవడంతో ఉద్యోగులు బలవుతున్నారు.

ఎన్‌హెచ్-165 పనులకు నివేదికలు అందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆకివీడు–దిగమర్రు జాతీయ రహదారి–165 నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ల నివేదికలను త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆర్ అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ తదితరుల శాఖల అధికారులతో 45 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి–165 నిర్మాణానికి సమర్పించిన మూడు అలైన్‌మెంట్లపై ఆమె సమీక్షించారు. తొలుత ఎన్‌హెచ్ అధికారులు రూపొందించిన మూడు అలైన్‌మెంట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రహదారులు, భవనాలు, విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మూడు అలైన్‌మెంట్లకు సంబంధించి వారంలోపు పూర్తి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డీఆర్‌ఓ జె.ఉదయభాస్కరరావు, ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొట్టుకుపోయిన లో లెవెల్ కాజ్‌వే



వింజరం, తానాలకుంట గ్రామాల మధ్య కొట్టుకుపోయిన లో లెవెల్ కాజ్‌వే

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవాగులు పొంగి ప్రవహించడంతో వింజరం, తానాల కుంట గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ కాజ్‌వే కొంత భాగం కొట్టుకుపోయింది. పోలవరం నుంచి ఈ రహదారిలో సుమారు 10 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కల్వర్టు నీటి ఉధృతికి రాళ్లతో సహా కొంత భాగం కొట్టుకుపోవడంతో జంగారెడ్డిగూడెం నుంచి తిరిగే ఆర్టీసీ బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి సమయాల్లో ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీస మరమ్మతులు చేసైనా రాకపోకలకు ఏర్పాటు చేయాలని ఆ గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

మద్ది అంజన్న సన్నిధిలో...



డీఐజీ లక్ష్మికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కొండలరావు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని డీఐజీ ఆఫ్ పోలీస్ కమ్యూనికేషన్ (విజయవాడ) ఎస్ ఎస్‌జే లక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఆమెకు ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈవో ఆకుల కొండలరావు డీఐజీ లక్ష్మిని శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను, స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం



పెదలింగంపాడు చెర్వు వద్ద కోళ్ల వ్యర్థాలను డంప్ చేస్తుండగా పట్టుకున్న అధికారులు

భీమడోలు: కొల్లేరు పరివాహక ప్రాంతంలోని భీమడోలు రెవెన్యూ పరిధిలో గల పెదలింగంపాడులో చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పోలీసులు, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు పట్టుకున్నారు. లింగంపాడులో గంటామోహనరావు 120 ఎకరాల చేపల చెర్వును లీజుకు తీసుకుని చేపల సాగు చేస్తున్నాడు. హైదరాబాద్ నుంచి ఓ వ్యాన్‌లో 4 టన్నుల కోళ్ల వ్యర్థాలను చెర్వు వద్దకు తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వ్యాన్‌తో పాటు కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌తో పాటు లీజుదారుడైన గంటా మోహనరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ చెప్పారు.

జానపదం.. చైతన్య పథం

- సామాజిక ఉత్సాహం కోసం ప్రారంభమై కళలుగా అవతరించి..
- నేడు ప్రపంచ జానపద దినోత్సవం



పల్లె సుద్దులు ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నుంచి సన్మానం పొందుతున్న సబ్బి కనకారావు (ఫైల్)



చెక్క భజన బృందం ప్రదర్శన (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జానపదం.. ప్రస్తుత సమాజంలో ఎవరికీ పట్టని ఒక పదం.. పూర్వం సమాజాన్ని మేల్కొలిపిన ఒక విప్లవ వీచిక. తమ భవిష్యత్ తరాలకు తమ సంస్కృతిని, సంప్రదాయాలను అందించడానికి ఆయా సమాజాలకు చెందిన వ్యక్తుల సమూహం రూపొందించుకున్న కళ. ప్రసార సాధనాలు లేని కాలంలో, నిరక్షరాస్యులైన ప్రజలకు ఏ భాషలో చెబితే వారి హృదయాంతరాళాల్లోకి భక్తిభావం, తమ ప్రాంత చారిత్రక వైభవం తలకెక్కుతాయో ఆలోచించి రూపొందించిందే ఈ జానపదం. జానపదాన్ని ఒక కళగా కాక కళల సమూహంగా పిలవాల్సిన అవసరం ఉంది. నటనకో, నృత్యానికో, విన్యాసానికో పరిమితం కాకుండా వివిధ కళలను తన ఒడిలో ఇముడ్చుకున్న పదమే జానపదం. తమ జాతిని పదం కలిపేలా చేసిందే జానపదం. ఇతర సంస్కృతులను, సంప్రదాయాలను అధ్యయనం చేసేలా ప్రోత్సహించిందీ జానపదమే.

కళలుగా అవతరించిన వైనం..

తమ సమాజాన్ని ఉత్సాహ పరచడం కోసం ఒక వినోద సాధనంగా ప్రారంభమై అనంతర కాలంలో ఒక కళగా అవతరించిందే జానపదం. మానవ సమాజం నాగరికత వైపు అడుగులు వేయకముందు కొన్ని వర్గాలు, కొన్ని తెగలు, కొన్ని ప్రాంతాల్లో వారికి అందుబాటులో ఉన్న వస్తువులతో పరికరాలను తయారు చేసుకుని వాటి నుంచి లయబద్ధంగా స్వరాలను సృష్టించి, ఆయా స్వరాలకు అనుగుణంగా మాటలు, పాటలతో తమ జాతికి ఉత్సాహాన్ని అందించడంలో ఈ జానపద కళ బలమైన పునాది వేసింది.

ప్రాంతానికో జానపద కళ

తమ ప్రాంతానికి తగ్గ ఆలోచనలతో ఆయాప్రాంతాలకు చెందిన పూర్వీకులు కొన్ని కళలను సృష్టించుకున్నారని చరిత్ర చెబుతోంది. అలా సృష్టించుకన్న వాటిలో ఆధ్యాత్మికంగా కోలాటం ఇప్పటికీ ప్రజలతో మమేకమై కొనసాగుతోంది. కాగా బుర్రకథ, తోలు బొమ్మలాట, వీరనాట్యం, భజనలు, గరగ నృత్యం, లంబాడీ నృత్యం, దేవరపెట్టె ఇంద్రజాలం, యక్షగానం, పగటి వేషాలు, వీధి నాటికలు, పొడుగు మనుషులు, తప్పెటగుళ్ళు, డప్పు నాట్యం, బొల్ల నృత్యం, బుట్టబొమ్మలు, పులివేషం, చెక్క భజన, థింసా నృత్యం, చిందు, భోగమాట, దొమ్మాట, వీధి భాగోతం, జముకుల కథ, ఒగ్గు కథ, పల్లెసుద్దులు, జంగం దేవర, భామా కలాపం, తూర్పు భాగోతం, పిట్టల దొర వంటివి కొన్ని కళలు మాత్రమే. పూర్వం తెలుగు రాష్ట్రాల్లో వీటన్నింటికి ప్రాంతాల వారీగా ఆదరణ ఉండేది. ఆయా కళలకు డప్పు, డోలు వంటి చర్మ వాయిద్యాలు, ఊరుడుబిల్ల, బూర వంటి వాయు వాయిద్యాలు, తంబుర, తంతాన వంటి తీగ వాయిద్యాలు ఆయా కళా ప్రదర్శనలకు అదనపు సొబగులు అద్దేవి. అనేక మంది జానపద కళాకారులు కూడా భారతదేశ అత్యున్నత పౌరపురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డులు సాధించి ఈ కళలకు సమాజంలోఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పారు.

ఆది దంపతుల కల్యాణానికి రుంజ వాయిద్యం



విశ్వంలో ఏ వాయిద్య పరికరమూ లేని సమయంలో తొలి వాయిద్యంగా సృష్టించబడిందే రుంజ వాయిద్యం. ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి వినియోగించే నిమిత్తం ఈ వాయిద్యాన్ని విశ్వకర్మ భగవానుడు ఈ పరికరాన్ని సృష్టించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురితో చావు లేకుండా వరం పొందిన రుంజకాసురుడు అనే రాక్షసుడిని వధించి అతని శరీర అవయవాలతోనే ఈ వాయిద్యాన్ని సృష్టించినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి.

– దాసోహం వెంకటేశ్వరాచార్యులు, రుంజ వాయిద్య కళాకారుడు

ప్రాచీన కళారూపం బుర్రకథ



తెలుగుగడ్డపై ఉన్న ప్రాచీన కళారూపాల్లో బుర్రకథ ఒకటి. పూర్వం వీరశైవులకు, శ్రీవైష్ణవులకు మతపరమైన తగవులు జరిగే సమయంలో జంగాలు బుర్రకథా కళారూపం ద్వారా తమ మత ప్రచారాన్ని సాగించేవారని, తొలుత ఈ కళారూపాన్ని జంగకథ అని పిలిచేవారని పురాణ గాథల ద్వారా తెలుస్తోంది. ఈ కళారూప ప్రదర్శన ద్వారా నాజర్ పద్మశ్రీ పురస్కారం పొందారు. ఆయన అడుగుజాడల్లో నడిచి నేను ఈ కళారూపాన్ని వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శించి పలువురు ముఖ్యమంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు పొందాను.

– సబ్బి కనకారావు, బుర్రకథా కళాకారుడు

తెల్లవారగానే ఆధ్యాత్మికతను పంచే హరిదాసు



అక్షయపాత్ర శిరస్సున ధరించి, శృతిబద్ధంగా తంబురా మీటుతూ, లయబద్ధంగా చిడతలు వాయిస్తూ ఒకపక్క సంకీర్తన పాడుతూ, మరోపక్క అందెల సవ్వడితో నాట్యం చేస్తూ వేకువ జామునే వీధులన్నింటినీ భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మికతను పంచే కళారూపమే హరిదాసు. ఖాళీ అక్షయ పాత్రతో హరిదాసు తమ గుమ్మం ముందునుంచి వెళితే అరిష్టమని ప్రజలు భావిస్తారు.

– తిరుక్కోవళ్ళూరి శ్రీనివాస పెరుమాళ్, తెలుగు రాష్ట్రాల హరిదాస సంప్రదాయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు

గ్రామీణ జీవన విధానమే జానపదం



మన గ్రామీణ జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపేవే జానపద కళలు. ఇవి ప్రజల నుంచి పుట్టినవి కాబట్టి వారి నిత్య జీవితానిక అద్దం పడతాయి. శాస్త్రీయ కళారూపాలు, రంగస్థల కళాకారుల్లా జానపద కళలకు, కళాకారులకు ప్రభుత్వం సమాన హోదా కల్పించాలి.

– దువ్వి రామారావు, ఏపీ సకల కళాకారుల సంక్షేమ సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు

కళలు తెలుగు ప్రజల సొంతం



తెలుగు నేల కళలకు పుట్టినిల్లు. ప్రపంచంలో ఏ ప్రాంతానికీ లేని కళలు మన తెలుగు వారి సొంతం. ఆదరణ లేక కొన్ని జానపద కళారూపాలు కనుమరుగయ్యాయి. కులాలు, ఆచారాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, ప్రాంత భేదాలు కళలపై ప్రభావం చూపాయి.

– డీ హేమ సుందర్, అఖిలభారత తెలుగు సేన (నాగపూర్) సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు

అమ్మ పేరు మీద ఒక మొక్క



కేవీకేలో మొక్కలు పంపిణీ చేస్తున్న కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ

తాడేపల్లిగూడెం: భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి న్యూఢిల్లీ ఆదేశాల మేరకు అమ్మపేరు మీద ఒక మొక్క కార్యక్రమం వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో బుధవారం జరిగింది. కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల నేల కోతను నివారించవచ్చన్నారు. మొక్కలు హానికరమైన బొగ్గుపులుసు వాయువును పీల్చుకొని ఆక్సిజన్ విడుదల చేయడం వల్ల పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చన్నారు. ఈ సందర్భంగా రైతులకు నిమ్మ, చెర్రీ, వాక్కాయ మొక్కలను అందజేశారు. కేవీకేలో మునగా, కరోండా మొక్కలను నాటారు. విశ్వవిద్యాలయంలోని అన్ని విద్యాలయాల్లో 1380 మొక్కలు విద్యార్థులు నాటి, వాటిని పోషణ చేస్తున్నారన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.దీప్తి, దేవీ వరప్రసాదరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వెంకట సతీష్, ఎస్.చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన కేసులో ఏడుగురి అరెస్ట్

భీమవరం: బంగారానికి మెరుగుపెడతామంటు మహిళను మోసం చేసిన కేసులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామంలోని ఉప్పుగుంటచెరుకు చెందిన చిట్టిగొల్ల మణి ఇంటికి ఈనెల 17వ తేదిన ఇద్దరు వ్యక్తులు వచ్చి వెండి, బంగారు ఆభరణాలకు మెరుగుపెడతామన్నారు. దీనితో మణి తన వద్ద ఉన్న వెండి, బంగారు ఆభరణాలు ఇవ్వగా వాటిని వారివెంట తెచ్చుకున్న యాసిడ్ ద్రావణంలో ముంచి తరువాత వాటికి పసుపు రాసి ఆమెకిచ్చారు. అయితే బంగారం బరువు తగ్గడం, యాసిడ్ ద్రావణం తీసుకుని వెళ్లిపోతుండగా మణి కేకలు వేయడంతో మెరుగుపెట్టిన వ్యక్తులు పారిపోయారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై రహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం పట్టణంలోని పద్మాలయ థియేటర్ వెనుక రాయలం రోడ్డులో నిందితులు పాండవ కుమార్ యాదవ్, పవన్‌కుమార్, సంజయ్‌యాదవ్, సంతోష్‌కుమార్ మండల్, రంజిత్ మండల్, సురేష్ కుమార్ యాదవ్, ఉదయానంద్ యాదవ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది

- ఇద్దరు కుమారులను బలిగొన్న రోడ్డు ప్రమాదాలు
- కానిస్టేబుల్ రామారావు మృతితో శోకసంద్రంలో తల్లిదండ్రులు

ఆకివీడు: విధి.. రోడ్డు ప్రమాదాల రూపంలో ఆ కుటుంబాన్ని వెంటాడింది. గతంలో అన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇప్పుడు తమ్ముడ్ని కూడా రోడ్డు ప్రమాదం బలిగొంది. ఈ వయసులో తమ ఆలనాపాలనా చూడాల్సిన కుమారులు తమ కంటి ముందే మరణించడంతో వృద్ధులైన ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వివరాల్లోకి వెళితే ఆకివీడులోని సమతానగర్ రోడ్డులో నివసిస్తున్న కొట్నాని సింహాచలం, సీతమ్మలకు ఒక ఆడ, ఇద్దరు మగ పిల్లలు. కుమార్తెకు వివాహం చేసి పంపించారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. తొమ్మిదేళ్ల క్రితం అతడు నారాయణపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్న లేని లోటు రాకుండా వారి ఆలనా పాలనా సింహాచలం చిన్న కుమారుడు తారక రామారావు దంపతులు చూసుకునేవారు. అతడు కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించడంతో ఆ కుటుంబం కొంత తేరుకుంది. అయితే విజయవాడలో పనిచేస్తున్న రామారావును కూడా బుధవారం రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. దీంతో తల్లిదండ్రులు సింహాచలం, సీతమ్మ దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు. వారి బంధువులు, స్నేహితులు ఈ విషాద ఘటన చూసి కంటతడి పెట్టుకున్నారు.

కన్నీరుమున్నీరైన స్నేహితులు



కానిస్టేబుల్ తారక రామారావు(ఫైల్)

వారం రోజుల క్రితం ఆకివీడులోని సమతానగర్ వచ్చిన కానిస్టేబుల్ రామారావు తన స్నేహితులతో సమతానగర్ రోడ్డును పునర్నిర్మించేందకు నడుం బిగించాలని సూచించారు. దీంతో స్నేహితులు దాతల సహకారంతో సమతానగర్ రోడ్డును యుద్ధప్రాతిపదికన పునర్నిర్మించారు. రామారావు మరణవార్త వినగానే స్నేహితులంతా హుటాహుటీనా విజయవాడ వెళ్లి మృతదేహాన్ని రాత్రికి ఆకివీడు తీసుకువచ్చారు. స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి మృతదేహాన్ని భారీ ఊరేగింపుతో సమతానగర్‌కు తీసుకువచ్చారు. బంధువులు, స్నేహితులు కడసారి చూసి కన్నీరు మున్నీరయ్యారు.

ఆక్వా సాగులో నిబంధనలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖాధికారి ప్రసాద్, ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనందకుమార్

పాలకొల్లు అర్బన్: అప్సడ, ఎంపెడా నిబంధనలకు అనుగుణంగా రైతులు ఆక్వా సాగు చేసుకుని లాభదాయకమైన ఫలసాయం పొందాలని జిల్లా మత్స్య శాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ కోరారు. పాలకొల్లు మండలం చందపర్రు ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం ఆక్వా రైతులు, డీలర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.24 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా కేవలం 45 వేల ఎకరాలకు మాత్రమే రైతులు అనుమతులు పొందారన్నారు. రొయ్యలు సాగు చేస్తున్న ప్రతి రైతు తమ చెరువులకు సంబంధించి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ, రాష్ట్ర ఆక్వా అభివృద్ధి సంస్థల నుంచి అన్ని అనుమతులు ఉండాలని కోరారు. అలా అనుమతులు ఉన్న చెరువుల్లోని రొయ్యలకు మాత్రమే ఎగుమతులకు ఏ విధమైన ఆటంకాలు ఉండవని సూచించారు. ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఆనందకుమార్ మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతు తమ చెరువుకి సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పలువురు ఆక్వా రైతులు అడిగిన ప్రశ్నలకు సలహాలు, సూచనలు చేశారు. మండల మత్స్యశాఖాధికారి ఎల్ఎల్ఎన్ రాజు, క్షీరపురి ఆక్వా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బోనం వెంకట నరసయ్య (చినబాబు), రైతులు కోడి విజయ్‌భాస్కర్, మేడిది జాన్ డేవిడ్‌రాజు, కెమికల్ కంపెనీ మేనేజర్ హరికృష్ణ, గ్రామ మత్స్యశాఖ అధికారులు కె జ్యోత్స్న రాజేశ్వరి, వి మంజుల తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో మెలకువలు ఇలా..

చింతలపూడి: మొక్కజొన్న పంటను వర్షాధారంగాను, సాగునీటి కింద పండించడం జరుగుతుంది. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండ దాణా రూపంలో పశువులకు మేతగాను, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా, పేలాల పంటగా, కాయగూర రకంగానూ రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు వివరాలను వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ రైతులకు సూచించారు.

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ మొక్కజొన్న సాగు

ఎలాంటి నేలలు అనుకూలం

మురుగునీరు పోయే లోతైన ఎర్రగరప, మధ్యస్థ నల్ల నేలలు బాగా అనుకూలం. నేలలో తేమను బట్టి ఉంచే గుణం ఉండాలి. నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్క జొన్న దిగుబడి సరిగా రాదు. నేల ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 మధ్య ఉండాలి.

విత్తే సమయం

సాధారణంగా జూన్ 15 నుంచి జూలై లోగా విత్తుకోవాలి. అయితే వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రీడ్ రకాలు ఆగస్టు రెండో వారంలో కూడా విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

- **దీర్ఘకాలిక రకాలు:** (100–120) రోజులు డీఎచ్‌ఎం – 113, 900 ఎం గోల్డ్, బయో 9861, ప్రో–311, 30బి07
- **మధ్యకాలిక రకాలు** : (90–100 రోజులు) డీఎచ్‌ఎం–111, 117, 119, కేహెచ్–510, బయో–9657, కేఎం–9541, ఎంసీహెచ్–2
- **స్వల్పకాలిక రకాలు** : (వీటి కాల పరిమితి 90 రోజుల కంటే తక్కువ) డీఎచ్‌ఎం– 115, ప్రకాశ్ కేహెచ్–5991, జేకేఎంఎచ్–1701–డీకేసీ–7074 ఆర్, ఎంఎంఎచ్–1701, డీకేసీ– 7074 ఆర్, ఎంఎంఎచ్– 133,3342.

ప్రత్యేక రకాలు

తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్): మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా స్వీట్ కార్న్ రకాలు, సుగర్–75, బ్రైట్‌జేన్ సంకర రకాలు.

విత్తే విధానం

ఎకరాకు సంకర రకాలైతే 7–8 కిలోల విత్తనం వాడి 60 సెంటీమీటర్ల ఎడంగా బోదెలు చేసి సాళ్లలో 20 సెం.మీ ఎడంగా విత్తాలి. ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు వస్తాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం 45 చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.

ఎరువుల వాడకం

ఖరీఫ్ పంటలో ఎకరాకు 72–80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. మొత్తం పొటాష్, భాస్వరం ఎరువులను పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒక వేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ (20 గ్రా) పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800–1200 గ్రా, అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2–3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపును నివారించవచ్చును. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2, 4–డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ

పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొల్చే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10–12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా కోరా.ఎన్ (03 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25–30 రోజుల దశలో ఆకు సుడుల్లో వేయాలి.

- ఆకు మాడు తెగులు నివారణకు మాంకో జెబ్ (2.5 గ్రా) లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2–3 ఆకులు తుంచివేసి ప్రొపికొనజోల్ (1 మి.లీ) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొక్క ఎండు, కాండం మసికుళ్ళు తెగుళ్ల రాకుండా ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి, వేసవిలో లోతు దుక్కులు, పూత దశ తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు చూసుకోవాలి.



బి నాగకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, చింతలపూడి సబ్ డివిజన్

సాంకేతిక వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

ముదినేపల్లి రూరల్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను అనుసరించేందుకు రైతులు శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు, సింగరాయపాలెం గ్రామాల్లో బుధవారం పర్యటించి వ్యవసాయ శాఖ ద్వారా అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. బొమ్మినంపాడు రైతుల పొలాల్లో పురుగుమందులు, నానో ఫెర్టిలైజర్స్ పిచికారీ చేసేందుకు ఉపయోగించే వ్యవసాయ డ్రోన్ పనితీరును క్షేత్ర సందర్శన కోసం ప్రదర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా షేక్ హబీబ్ మాట్లాడుతూ కేవలం 5 నుంచి 6 నిమిషాల వ్యవధిలో ఎకరం విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయవచ్చన్నారు. అల్లూరులో ఈ–పంట నమోదును, సింగరాయపాలెంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొని నాట్లు వేసే విధానాన్ని పరిశీలించారు. మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి వేణుమాధవ్ పాల్గొన్నారు.

బంగారం, వెండి చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జరిగిన చోరీపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలో పెదవేగి రాంబాబు టైలరింగ్, కిరాణా షాపు నడపుకుని జీవిస్తున్నాడు. ఈనెల 19వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. 20వ తేదీ ఉదయం రాంబాబు భార్య లేచి ఇంటి పనులకు సిద్ధమవుతుండగా, చిల్డ్రన్ బెడ్ రూమ్‌లో ఉంచిన 1340 గ్రాముల వెండి వస్తువులు, 10 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి, భర్త రాంబాబుకు తెలియజేసింది. దీనిపై రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

ఉంగుటూరు: నారాయణపురం – గణపవరం ఆర్అండ్‌బీ రహదారిలో రావులపర్రు వద్ద మోటార్‌సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాలివి. నిడమర్రు గ్రామానికి చెందిన యాళ్ల వినోద్‌కుమార్ (32) మంగళవారం పనిమీద తాడేపల్లిగూడెం వెళ్లాడు. తిరిగి వస్తుండగా తన మోటార్‌సైకిల్ ఆగిపోవడంతో కాలినడకన నిడమర్రు వెళుతున్నాడు. రావులపర్రు –రాచూరు గ్రామాల మధ్యకు వచ్చే సరికి మోటార్‌సైకిల్ ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలాన్ని సందర్శించారు. వినోద్ మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు బుధవారం అప్పగించారు. కాగా ప్రమాదానికి కారణమైన నిందితుడు రాచూరుకు చెందిన మద్దిరాల వెంకట వినయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

- చెత్త, చెదారంతో మురుగు కూపంలా..
- సర్పాలు, విషపురుగులు, దోమలకు ఆవాసం
- భయాందోళనకు గురవుతున్న తణుకు ప్రజానీకం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తణుకు అర్బన్: పురపాలక సంఘం పరిధిలో వార్డుల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవుల నుతలపిస్తున్నాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో పిచ్చి మొక్కలు, కంపచెట్లు, పొదలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిలో సర్పాలు, విషపురుగులు, దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడంతో సంచారం అధికమైంది. ఈ ఖాళీ స్థలాల్లో చుట్టు పక్కలవారు ఇతరులు వ్యర్థాలు, చెత్త వేస్తున్నారు. కొన్ని చోట్ల పక్కనున్న ఇళ్ల నుంచి మురుగునీరు ఖాళీ స్థలాల్లోనే వదులుతున్నారు. దీంతో ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా మారి, దోమలకు ఆవాసాలుగా ఉంటున్నాయి. విష కీటకాలు, పాములు, సమీపంలో నివాసగృహాల వద్దకు సంచరిస్తుండడంతో అక్కడివారంతా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.

ఖాళీ స్థలాలు కొని వదిలేస్తున్నారు...

వృత్తి, వ్యాపారా, ఉద్యోగ రీత్యా దూరప్రాంతాల్లో స్థిరపడిన కొందరు స్థానిక రియల్టర్లు ఎన్నో ఏళ్ల క్రితం తక్కువ ధరకు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేసి వాటి ధర పెరుగుతుందనే ఉద్దేశంతో అలాగే వదిలేశారు. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి, పల్లంగా ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్ల ఉండిపోతుంది. రోజుల తరబడి నీరు నిల్వుండిపోయి మురగునీరు మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతూ సమీపంలో ఇళ్లలో నివాసముంటున్న వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమ కాట్లతో తరుచూరోగాల బారిన పడుతున్నామని పలువురు స్థానికులు వాపోతున్నారు. ఖాళీ స్థలాలను యజమానులు సక్రమంగా నిర్వహించేకునేలా చూడాల్సిన బాధ్యత పురపాలక అధికారులపై ఉందని, అయినా వారు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంటోందని ఖాళీ స్థలాలతో ఇబ్బందులు పడుతున్న జనం ఆవేదన చెందుతున్నారు.

విష జంతువులు, దోమలకు నిలయంగా..

తణుకు బ్యాంక్ కాలనీలో ఈ సమస్య అత్యధికం కాగా హౌసింగ్ బోర్డు, ఎన్జీవోస్, సజ్జాపురం, పాతవూరు, ఇరగవరం కాలనీల్లో సైతం తిష్టవేసింది.. ఖాళీ స్థలాల్లోఉన్న దుర్గంధంతో దోమలు పగటిపూట కూడా బయట నిలబడలేని దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఖాళీస్థలాలు దోమలకు నిలయంకాగా, రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లో పెరిగిపోయిన పిచ్చిమొక్కల కారణంగా విష జంతువులు రోడ్డుపైనే సంచరిస్తున్నాయని చీకట్లో పాములు వాహనాలకు ఎదురొస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పగలు సైతం భారీ విషసర్పాలు రహదారి అటుకిఇటుకి ప్రయాణిస్తుండడం భయాందోళనకు గురవుతున్నామని ప్రజానీకం వాపోతున్నారు. సమస్య తీవ్రంగా కనిపిస్తున్నప్పటికీ ఇటు పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



తణుకు స్వాతంత్ర్య సమరయోధుల ఉద్యానవనం ప్రాంతంలో మురికి కూపంగా మారిన స్థలం



తణుకు బ్యాంక్ కాలనీలో చిట్టడవిగా మారిన ఖాళీ స్థలం

ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు

తణుకు బ్యాంక్ కాలనీలో ఖాళీ స్థలాలు అడవుల్లా మారిపో యాయి. కొన్ని స్థలాల్లో మొక్క లు పెరిగిపోగా మరి కొన్ని స్థలాలు మురుగునీటితో నిండిపోయి అపరిశుభ్రంగా మారాయి. దీంతో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. రహదారులకు ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాములు రోడ్డుపైనే సంచరిస్తుండడంతో పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే భయపడుతున్నాం.

– టి.వెంకటేశ్వరరావు, బ్యాంక్ కాలనీ, తణుకు

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి



తాడేపల్లిగూడెం చేరుకున్న యాత్రికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో సురక్షిత ప్రయాణం, సరమైన ధరలకు పుణ్యక్షేత్రాల దర్శనం చేయిస్తున్నామని, యాత్రికులు, భక్తులు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ ప్రత్యేక బస్సు బుధవారం తాడేపల్లిగూడెం చేరింది. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. యాత్రికులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శివకంచి, వామన కంచి, విష్ణుకంచి, మార్గమధ్యలో తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించినట్లు చెప్పారు. డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, చార్జ్ కేవలం కేవలం రూ. 2,600 మాత్రమే, కంచికి రూ 3,000 మాత్రమే తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. మరన్ని వివరాలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కార్యాలయంను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

దివ్యాంగుల చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపాలి



దివ్యాంగుల సెంటర్ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపాలని పలువురు దాతలు పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో బుధవారం దాతలచే పిల్లలకు బిస్కెట్స్, చాక్లెట్స్, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విద్యకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. బలివాడ సతీష్, మౌనిక, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, భారతి, జ్యోతిర్మయి, ఫిజియోథెరపీ వైద్యులు అల్లు శ్రీ కృష్ణ మహేష్, ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు

అత్తిలి: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయాలని ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పాత విధానంలో గృహనిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ డీఈ ప్రసాద్ చెప్పారు. కాలనీలలో అంతర్గత రహదారుల నిర్మాణం నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్లు హౌసింగ్ డీఈ తెలిపారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉందని వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంచిలి పీహెచ్‌సీలో వాచ్‌మెన్‌ను నియమించాలని వైద్యాధికారిణి చాముండేశ్వరి కోరారు. కంచుమర్రు పాఠశాలకు విద్యుత్ మీటరు ఏర్పాటు చేయాలని గ్రామసర్పంచ్ పెన్మెత్స వెంకటకృష్ణంరాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో అమీలుజమా, తహసీల్దార్ డి వంశీ, ఏఓ వీవీవీఎస్ రామరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి విరాళం



వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వెంకట్రావు - బేబి దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవీ భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి పెంటపాడుకు చెందిన భీమడోలు వెంకట్రావు – బేబి దంపతులు బుధవారం రూ.9వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలి

తణుకు: సంచార నాలుగు చక్రాల బండ్లపై మిక్చర్, బజ్జీ, పానీపూరి వంటివి అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్న వీధి విక్రయదారుల సంక్షేమానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తమవంతు సహకారం అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ వీధి విక్రయదారుల ఉపాధికి భద్రత కల్పించాలని, సబ్సిడీపై రుణాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం సంఘ సభ్యులు ఎమ్మెల్యే రాధాకృష్ణ చేతులు మీదుగా సంఘం గుర్తింపు కార్డులు అందజేశారు. తణుకు సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం అధ్యక్షుడు కిలాని శ్రీనివాస్, కార్యదర్శి రేలంగి రాజు, ఉపాధ్యక్షుడు రవి పతి, కమిటీ సభ్యులు బూర సింహాచలం, నొడగల శ్రీనివాస్, బూర అప్పలరాజు, నక్కా శ్రీనివాస్, నొడగల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

23న ఉపాధి హామీపై గ్రామ సభలు

పాలకోడేరు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూకల మురళిగంగాధర్ రావు తెలిపారు. ఈ గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని రోజుకు రూ.300 దినసరి వేతనం లభించేలా కొలతలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తిస్తారని ఎంపీడీవో తెలిపారు.

సూర్యనారాయణ కుటుంబానికి 'కొట్టు' పరామర్శ



అప్పారావుపేట గ్రామంలో మాజీ ఎమ్పీటీసీ సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట మాజీ ఎమ్పీటీసీ నార్పిరెడ్డి సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. సూర్యనారాయణ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొలుత సూర్యనారాయణ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మాధవరంలో వీఆర్వో సిరంగుల ప్రకాష్ కుటుంబాన్ని కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, కొమ్ముగూడెం సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, తమ్మిశెట్టి చుక్కయ్య, మద్దాల మాధవ్, ప్రత్తి రంగయ్య, సాదే శ్రీను, గోపిశెట్టి దొరబాబు, లక్కాకుల సత్యనారాయణ, తారమట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అత్తిలి: బల్లిపాడులో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ అధికారిణి స్వప్నశ్రీ



ఇరగవరం: మాట్లాడుతున్న అధికారులు



తాడేపల్లిగూడెం అర్బన్: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా సంరక్షణ అధికారిణి ఎం స్వప్నశ్రీ అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ పడావో-బేటీబచావో కార్యక్రమంపై అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాల వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వప్నశ్రీ మాట్లాడుతూ బాలికల చదువు భావితరాలకు వెలుగు అని అన్నారు. బాల్యవివాహాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి నిర్మలకుమారి, డి నర్సవేణి, ఎం శివ సత్యవతి, సిహెచ్‌వీ రామలలిత, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

ఇరగవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో ప్రమోదిని కుమారి, ఎం ఆషా రోహిణి అన్నారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుందర్ రాజు, ఎంఈవోలు ఎస్ శ్రీనివాస రావు, ప్రసాద్, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాణిక్యాంబ, ఎస్ కాంత కుమారి, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, విఆర్‌వోలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో 19వవార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు, బాలికలకు మహిళా చట్టాలపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సీహెచ్‌కే దుర్గ, భవాని, కె విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి త్రివేణి, ఆర్ లక్ష్మి తులసి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా ఏకాగ్రత పెంపు

వీరవాసరం: నేలపోగుల ఎంపీయూపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు కె.రూజ్ వెల్ట్ అధ్యక్షతన ఉచిత ధ్యాన శిక్షణను బుధవారం నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎస్ సుబ్బరాజు జ్ఞానబోధ చేశారు. విద్యార్థులు ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. ఎన్ని సంవత్సరాల వయసైతే అన్ని నిమిషాలు రోజుకు రెండుసార్లు విధిగా ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగన్న, షాకీర్ ఉన్నిషా, గుత్తుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బంద్



తాడేపల్లిగూడెం(టీఓసీ): తాలూకా ఆఫీస్ సెంటర్ నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు



తణుకు: బస్టాండు ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ఆందోళనకారులు

తణుకు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా పలు బహుజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగిన భారత్ బంద్ తణుకులో ప్రశాంతంగా ముగిసింది. విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేయగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, బ్యాంకులను ఆందోళనకారులు మూయించివేశారు. తణుకు డిపో నుంచి ఆర్టీసీ బస్సులు బయటకు రానీయకుండా ఉదయం ఆందోళనకారులు బస్టాండు ఆవరణలో నిరసన చేపట్టారు. తొలుత మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు తణుకులో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. మాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు తిర్రే రవిదేవా మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మొల్లం మైఖేల్, మాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మర్రి నవీన్‌బాబు, కేసరపల్లి వెంకట్రావు, పొట్ల సురేష్, పాతూరి నరేంద్రబాబు, దళితసేన రాష్ట్ర అధ్యక్షులు విప్పర్తి ప్రసాద్, రెల్లి ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు నీలాపు దుర్గారావు, జైభీమ్ యూత్ అధ్యక్షుడు పెనుమాల రాజేష్, మద్దెల సురేష్‌బాబు, కొండే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ అత్తిలిలో దళిత నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని బుధవారం బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు పానుగు వినయ్ బాబు, బట్టు నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, ఈడూరి రాంబాబు, రేవులగడ్డ భద్రయ్య, తేలి సుందరరావు, యాళ్లస్వామి, బుడితి సుజన్‌కుమార్, సబ్బితి రాజేష్, రాయుడు ధర్మారావు, ఇల్లూరి సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃరాలోచించాలని కోరుతూ బుధవారం ఉదయం నియోజకవర్గంలో తాడేపల్లిగూడెం, పెంటపాడులలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను కొద్ది సేపు నిలుపుదల చేశారు. బస్సులను ఆపకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫీస్, జెడ్పీ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాలలో కార్యాలయాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ముందుగానే సెలవులు ఇచ్చారు. వక్తలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం సరికాదని, సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, గుంపుల సత్యకృష్ణ, జైపాల్, అచ్చిబాబు, మురళీ, అబ్రహం, బాబ్జీ, ఎలీషా, రమేష్, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతికి విద్యే బలం



విద్యార్థులకు సూచనలిస్తున్న నిట్ అధ్యాపకుడు

తాడేపల్లిగూడెం: బాలికలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే విద్యేబలమని నిట్‌ను సందర్శించిన బాలికలతో నిట్ అధ్యాపకులు అన్నారు. బుధవారం విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మార్కాపురం, చిలకలూరిపేట, ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యార్థులు నిట్ సందర్శనకు వచ్చారు. డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతీ అడుగు వారి విజయానికి మెట్టుగా నిలిచినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు కృత్రిమ మేథస్సు, మిషన్‌లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాకెచెయిన్ టెక్నాలజీ, రోబోటిక్స్, బిగ్‌డేటా ఎనలిటిక్స్, వర్చువల్ రియాలిటీ, త్రీడీ ప్రింటింగ్ వంటి సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, కె.మాధురి, యామిని, బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈనెల 14న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజీ పడ్డదగిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల మధ్య రాజీ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు.


'ఉపాధ్యాయ' ఓటు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు, పశ్చిగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టినట్లు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పనిచేసే సెకండరీ స్కూల్, జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో మూడేళ్ల ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఈ ఓటరు జాబితాలో పేరు నమోదుకు అర్హులన్నారు. ఓటరుగా నమోదు చేసుకునే వారు ఫారం-19ను పూర్తి చేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీలోగా అందజేయాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తణుకు టౌన్: వేల్పూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి: బస్‌స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): కొవ్వొత్తులతో నిరసన

తణుకు టౌన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్లపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని సాలిపేట నుంచి గ్రామంలోని బస్టాండ్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామాంధుల చేతిలో హత్యకు గురైన వైద్యురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరగకుండా ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, బొక్కా ప్రమీలా, యండమూరి నాగేంద్ర, గుత్తుల వసంత కుమారి, బళ్ల నాగలక్ష్మీ, కళ్యాణి, రాణి, కే వీరభద్రరావు, రెడ్డి లీలా నాగవేణి, వెన్న దుర్గదేవి, పర్వతం కనక దుర్గ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో....

కలకత్తా వైద్య పీజీ విద్యార్థి, జూనియర్ వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. బుధవారం తణుకులోని బీసీ బాలికల కళాశాల, పాఠశాల హాస్టల్ విద్యార్థులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాధితురాలి హత్యపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీ వినోద్, సహాయ కార్యదర్శి ఎం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హతమార్చిన దుండగులను తక్షణమే శిక్షించాలని అత్తిలిలో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయపార్టీల నాయకులు బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వైద్య విద్యార్థిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అత్తిలి బస్ స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో పలురాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా స్థానిక బీజేపీ నాయకులు, జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులచే బుధవారం రాత్రి కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేశారు. జూనియర్ డాక్టర్ హత్య చేసిన హంతకులకు కఠిన శిక్షలు పడాలని, మరోసారి ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. నాయకులు డి.శ్రీని వాస్, కర్రి బాలాజీ, రాంబాబు, దత్తు వెంకటేశ్వరరావు, మహిళా కార్యకర్తలు వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, డాక్టర్ శోభారాణి, డి.ప్రియాంక, నర్సింగ్ విద్యార్థినీలు పాల్గొన్నారు.